




# కరపత్రం

SINCE 2014

శనివారం అక్టోబరు 11 2025 | సంపుటి :2 | సంచిక : 8 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# అఫ్ఘన్ గడ్డపై భారత్ వ్యతిరేక చర్యలను అనుమతించం

**తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ**

అఫ్ఘాన్ భూభాగంలో ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలను అనుమతించబోమని తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో పాక్‌ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘానిస్థానీల ధైర్యసాహసాలకు పరీక్ష పెట్టొద్దని కూడా గట్టి వార్నింగ్ ఇచ్చారు. కాబుల్‌లోని తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులను టార్గెట్ చేస్తూ పాక్ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. పేజి 2లో



## నోబెల్ శాంతి బహుమతి ప్రకటన..

**స్పందించిన వైట్‌హౌస్**



2లో

## ఆర్మీ చేతికి అవిశ్రాంత పక్షి 'మార్టలెట్.'. దీని ప్రత్యేకత ఏంటి..?



2లో

## దగ్గు మందు వివాదం.. సీబీఐ విచారణ పిటిషన్‌ను కొట్టేసిన 'సుప్రీం'

- దగ్గుమందు కారణంగా మధ్యప్రదేశ్‌లో పలువురు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.



2లో

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేతలు



2 లో

## బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా: కూనంనేని సాంబశివరావు

- బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు సంబరాలు చేసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

2 లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచి మోదీకి గిఫ్ట్ ఇస్తాం: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

- బీసీలను భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు.

2 లో

# హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు: భట్టి విక్రమార్క

- తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకాశాలపై ప్రచారం చేసే బాధ్యత నరెడ్కోపై ఉంది.
- హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికలు: ప్రభుత్వం అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రణాళికలు చేస్తోంది.
- హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నారుబీ గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారు.
- మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది.
- రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రాన్ని మారుస్తారుబీ ఇది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలుపుతుంది.

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకాశాలపై ప్రచారం బాధ్యత నరెడ్కోపై ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. నరెడ్కో ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. నరెడ్కో బ్రౌచర్‌ను వారు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఇందులో పలు స్థిరాస్తి సంస్థల స్టాళ్లు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.



మిగతాది 2లో

## శబరిమల నుంచి దృష్టి మళ్లించేందుకు నటులను టార్గెట్ చేసి..

**సురేష్ గోపి ఆరోపణలు**



: కేరళలోని శబరిమల ఆలయంలోని బంగారు విగ్రహాల తాపడం బరువు తగ్గడం ఇటీవల వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.

పాలక్కడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సురేష్ గోపి పాల్గొన్నారు. పేజి 2లో

## రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నాకు ముఖ్యం: మాజీ ఎంపీ అంజన్‌కుమార్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అలకబూనిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ బుజ్జగించారు. అంజన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఏ పరిస్థితుల్లో టికెట్‌ను వేరే వాళ్లకు కేటాయించాల్సి వచ్చిందనే విషయాన్ని ఆయనకు వివరించారు. పేజి 2లో



## ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లు తగ్గినా.. దూసుకెళ్తున్న గోల్డ్ ఈటీఎఫ్‌లు




మిగతాది 2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచి మోదీకి గిఫ్ట్ ఇస్తాం: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బీసీలను భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు.

"నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలి" అని రామచందర్‌రావు కోరారు.

## శబరిమల నుంచి దృష్టి మళ్లించేందుకు నటులను టార్గెట్ చేసి..

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా అక్కడ ఎదురైన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ ఆరోపణలు చేశారు. శబరిమల బంగారు సమస్య నుంచి దృష్టిని మరల్చేందుకు ఇద్దరు సినీ నటులను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఆ నటుల పేర్లను ఆయన ప్రస్తావించలేదు. శబరిమల బంగారు కవచాలకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లు ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయన్నారు. కేంద్రమంత్రిగా దీనిపై తాను ఇంతకుమించి వ్యాఖ్యానించలేనన్నారు. ఇలాంటి ఘటనలు సాధారణమేనన్నారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే సంఘటనలు జరిగినప్పుడు.. ప్రముఖులే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకోవడం మామూలే అన్నారు. ఇలాంటివి మరిన్ని చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

కేంద్ర మంత్రి ఆ నటుల పేర్లు చెప్పనప్పటికీ.. భూటాన్ నుంచి లగ్జరీ కార్లను అక్రమంగా దిగుమతి చేసుకున్నారన్న కేసులో ఇటీవల పలువురి నటుల ఇళ్లల్లో కస్టమ్స్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఆఫీసుతో పాటు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చకల్‌కల్ ఇళ్ల పైనా ఈ దాడులు జరిగాయి. దీంతో వీరిని ఉద్దేశించే సురేష్ గోపి తాజా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

## ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లు తగ్గినా.. దూసుకెళ్తున్న గోల్డ్ ఈటీఎఫ్‌లు

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ: బంగారం ధరలు పెరగడం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో గోల్డ్




ఈటీఎఫ్‌ల వైపు పెట్టుబడిదారులు ఎక్కువగా మొగ్గుచూపారు. దీంతో ఆగస్టులో రూ.2,190 కోట్ల ఇన్‌ఫ్లో ఉన్న గోల్డ్ ఈటీఎఫ్‌లు.. సెప్టెంబర్‌లో దాదాపు నాలుగు రెట్లు పెరిగి రూ.8,363 కోట్లకు చేరాయి. తద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే అత్యధిక నెలవారీ ఇన్‌ఫ్లోగా నిలిచింది. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల మొత్తం నిర్వహణ ఆస్తులు రూ.90,000 కోట్ల మార్క్‌ను దాటాయి. సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో కూడా పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఈ మేరకు భారత మ్యూచువల్ ఫండ్స్ సంఘం తాజాగా గణాంకాలు విడుదల చేసింది.

బంగారం, వెండి కేటాయింపులు పెరగడంతో మల్టీ-అసెట్ ఫండ్లు కూడా దాదాపు రూ.5,000 కోట్ల ఇన్‌ఫ్లో నమోదు చేశాయని శ్రీరామ్ ఏఎంసీ ఎండీ, సీఈవో కార్తిక్ జైన్ తెలిపారు. పెట్టుబడులకు బంగారం సురక్షితమైన ఎంపిక అని ఏంజెల్ వన్ ఏఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ హేమెన్ భాటియా తెలిపారు. సెంట్రల్ బ్యాంకులు నిరంతర కొనుగోళ్లు కొనసాగిస్తుండటం, జియోపొలిటికల్ టెన్షన్‌లు పెరగడం కారణంగా బంగారం విలువ మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

మరోవైపు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ల ఇన్‌ఫ్లో సెప్టెంబరులో వరుసగా రెండో నెల కూడా తగ్గింది. ఇది ఆగస్టులో రూ.33,430 కోట్లు ఉండగా.. సెప్టెంబర్‌లో 9 శాతం తగ్గి రూ.30,421 కోట్ల ఇన్‌ఫ్లో నమోదైంది. క్రమానుగత పెట్టుబడులు మాత్రం స్థిరమైన ఇన్‌ఫ్లోతో కొనసాగాయి. సిప్‌ల ద్వారా ఆగస్టులో రూ.28,265 కోట్ల పెట్టుబడులు రాగా.. సెప్టెంబర్‌లో ఇది రూ.29,361 కోట్లకు చేరింది. ఫ్లెక్సీ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్‌లు ఇన్‌ఫ్లోల్లో ముందంజలో నిలిచాయి. కానీ డెట్ ఫండ్‌ల నుంచి మాత్రం భారీ స్థాయిలో నిధుల ఉపసంహరణలు జరిగాయి.

## హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు: భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి

మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మార్చబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు.

"హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని ప్రచారం చేశారు. రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర పలకడంతో నగర అభివృద్ధి ఎలా దూసుకుపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ ఇవే ఉంటాయి. వీటికి పన్ను మినహాయింపులు కూడా ఇచ్చాం. మురుగునీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్ల వ్యయంతో ఎస్టీపీలను నిర్మించబోతున్నాం. నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం. విద్య, వైద్య రంగంపై మరింత దృష్టిసారిస్తున్నాం. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో 100 స్కూళ్లను నిర్మించబోతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. నరెడ్కో ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగంపై పెద్దమొత్తంలో ఖర్చు చేయండి. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేతలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. "కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై.. అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారు.

పిడబ్ల్యూడీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని.. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు(45) .. 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరారు. 1993లో నర్సంపేట దళంలో రిక్రూట్ అయి రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపును అందుకుని అతని భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇటీవల కాలంలో 403 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారు" అని డీజీపీ తెలిపారు.

అనంతరం అంజన్‌తో పాటు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు.

## రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నాకు ముఖ్యం: మాజీ ఎంపీ అంజన్‌కుమార్

మొదటిపేజీ తరువాయి

పార్టీ చర్యలతో మనస్తాపానికి గురైనట్లు అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కనపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. "పార్టీలో నేను చాలా సీనియర్. నేనెప్పుడూ ఓడిపోలేదు.. అందరూ కలిసి ఓడగొట్టారు. నాకు టికెట్ ఇస్తే గెలిచేవాడిని. కరోనాతో వెంటిలేటర్‌పై వైద్యం చేయించుకున్నా. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాను. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టాను. రెండు సార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నా ముఖ్య ఉద్దేశం" అని అంజన్‌కుమార్ అన్నారు.

అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ జూబ్లీహిల్స్‌లో అంజన్‌కుమార్ యాదవ్ పోటీచేయాలని భావించారని.. అధిష్ఠానం వేరేవాళ్లకు టికెట్ కేటాయించిందన్నారు. కరోనా సమయంలో అంజన్‌కుమార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని.. ఆయన కూడా కరోనా బారిన పడ్డారని చెప్పారు. నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని, అంజన్ సారథ్యంలోనే ఎన్నికల్లో పార్టీ ముందుకు వెళ్తుందని తెలిపారు. ఉప ఎన్నికలో అందరం కలిసి పనిచేస్తామని పొన్నం పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా: కూనంనేని సాంబశివరావు




మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు సంబరాలు చేసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. వారికి కనీసం బాధ కూడా లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వంపై ద్వేషమా.. బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు.

"అసెంబ్లీలో మద్దతు తెలిపి ఇప్పుడు సన్నాయి నొక్కులు ఎందుకు? బీసీ బిల్లుకు మేం మద్దతిచ్చాం.. కేసులో కూడా ఇంప్లీడ్ అయ్యాం. మీరెందుకు కాలేదు. సుప్రీంలో 50శాతం దాటొద్దని తీర్పు ఉంది. 9వ షెడ్యూల్‌లో పెట్టడం ద్వారా తమిళనాడులో ప్రత్యేక పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం కేంద్రానికి ఉన్నా చేయడం లేదు. బాధ్యత మొత్తం భాజపా పైనే ఉంది. కానీ డొంకతిరుగుడు రాజకీయాలతో ప్రజలను పార్టీ నేతలు గందరగోళానికి గురిచేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా.. వాళ్లకు మద్దతిస్తోంది భారత రాష్ట్ర సమితి. అన్ని పార్టీల నేతలను దిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. అవసరమైతే.. అన్ని పార్టీలతో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాటు చేయాలి. ఈ బిల్లు ఆమోదం పొందితే రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ముందడుగు పడుతుంది." అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

## అఫ్గన్ గడ్డపై భారత్ వ్యతిరేక చర్యలను అనుమతించం

మొదటిపేజీ తరువాయి

అయితే, అఫ్ఘాన్ కేంద్రంగా చేసుకుని తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదుల తీరుతో సహనం నశించి ప్రతి దాడి చేస్తు?న్నామని పాక్ పేర్కొనడం గమనార్హం. పాక్ దాడులపై అఫ్ఘాన్ మంత్రి ముత్తకీ స్పందించారు. 'సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాలపై దాడులు జరిగినట్టు తెలుస్తోంది. పాక్ తప్పు చేస్తోంది. దాదాపు 40 ఏళ్ల తరువాత అఫ్ఘానిస్థాన్‌లో శాంతి నెలకొంది. అభివృద్ధి కనిపిస్తోంది. ఈ సమయంలో మా ధైర్యసాహసాలను పరీక్షించే ప్రయత్నం చేయొద్దు. ఇలా చేస్తే ఏం జరుగుతోందో రష్యా, అమెరికా, నాటోలను వెళ్లి అడగొచ్చు. అఫ్ఘాన్‌తో గేమ్స్ వద్దని వారు చెబుతారు' అని ముత్తకీ వార్నింగ్ ఇచ్చారు. సీమాంతర ఉగ్రవాదం అంశంలో గత కొన్ని నెలలుగా పాక్, అఫ్ఘానిస్థాన్ మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం భారత్‌కు దౌత్య బంధాలు మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నించడం పాక్‌కు కంటగింపుగా మారింది. ఈ క్రమంలోనే సీమాంతర దాడులకు దిగొద్దంటూ పాక్‌ను అఫ్ఘాన్ మంత్రి హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని హెచ్చరించారు. ఇక అఫ్ఘానిస్థాన్ సౌర్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ముత్తకీకి భరోసా ఇచ్చారు.

## నోబెల్ శాంతి బహుమతి ప్రకటన..

మొదటిపేజీ తరువాయి

నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల ఈసారి తీరలేదు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారానికి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనాను ఎంపిక చేసినట్లు శుక్రవారం అకాడమీ ప్రకటించింది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం స్పందించింది. ఈ పురస్కార విజేత ఎంపికలో రాజకీయ వివక్ష చూపించారని విమర్శించింది.

తాజా పరిణామాలపై వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చుయెంగ్ మాట్లాడారు. "నోబెల్ కమిటీ మరోసారి శాంతి స్థాపన కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రపంచ శాంతి కోసం నిజమైన నిబద్ధత చూపించిన వారిని పక్కనబెట్టి రాజకీయ వివక్షను ప్రదర్శించింది. అయినప్పటికీ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను ఆపేందుకు తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు. శాంతి ఒప్పందాలతో ప్రాణాలు నిలబెడుతారు. ఆయన మానవతావాది. తన సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించే ఆయనలాంటి వ్యక్తి మరొకరు ఉండరు" అని చుయెంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## ఆర్మీ చేతికి అవిశ్రాంత పక్షి 'మార్ట్‌లెట్.'. దీని ప్రత్యేకత ఏంటీ..?

మొదటిపేజీ తరువాయి

భారత అమ్ముల పొదిలోకి త్వరలోనే మరో అధునాతన అస్త్రం చేరనుంది. రక్షణరంగంలో పరస్పర విస్తృత సహకారం కోసం భారత్-యూకే మధ్య కీలకమైన ఒప్పందం జరిగింది. దీనికింద తేలికపాటి, బహుళ ప్రయోజనకర క్షిపణి వ్యవస్థ 'మార్ట్‌లెట్'లను భారత సైన్యానికి సరఫరా చేసేందుకు అంగీకారం కుదిరింది. ఈ ఒప్పందంతో భారత గగనతల రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని కేంద్రం తమ ప్రకటనలో వెల్లడించింది. ఇంతకీ ఏంటీ 'మార్ట్‌లెట్' క్షిపణులు .? అవి ఎలా పనిచేస్తాయి?

ఆ పక్షి పేరు మీదుగా..

ఈ మార్ట్‌లెట్ క్షిపణులను ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌కు చెందిన 'థేల్స్ ఎయిర్ డిఫెన్స్' అనే రక్షణరంగ సంస్థ అభివృద్ధి చేస్తోంది. పురాణాలు, ఇతిహాసాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరు మీదుగా ఈ క్షిపణులకు పేరు పెట్టారు. ఎప్పుడూ విశ్రాంతి తీసుకోని, అలుపెరగని పక్షి అని దీని అర్థం. ఇవి తేలికపాటి, బహుళ ప్రయోజనకర ఎయిర్-టు-ఎయిర్, ఎయిర్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు.

**6 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను..**

గగనతల రక్షణతో పాటు డ్రోన్లు, సాయుధ వాహనాలు వంటి మిలిటరీ టార్గెట్‌లను కూడా ఛేదించేలా వీటిని రూపొందించారు. లేజర్ బీమ్ గైడెన్స్ ఆధారంగా రూపొందించిన ఈ క్షిపణిని పదాతిదళ సైనికులు భుజంపై ఉంచుకొని ప్రయోగించే వీలు ఉంటుంది. సాయుధ వాహనాలకు అనుసంధానం చేసి హెలీకాప్టర్లు, నౌకల నుంచి కూడా ప్రయోగించొచ్చు. ఆరు కిలోమీటర్ల పరిధిలో భూ, గగనతల ముప్పును ఈ క్షిపణులు ఎదుర్కోగలవు. 13 కిలోల బరువు ఉండే ఈ మిసైల్స్ ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లగలవు. వీటిని 2019 నుంచి బ్రిటిష్ మిలిటరీలో వినియోగిస్తున్నారు. ఇవే క్షిపణులను ప్రస్తుతం రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వినియోగిస్తోంది.


**భారత నేవీ కోసం రోల్స్ రాయిస్..**

మరోవైపు, భారత నౌకాదళంతో కలిసి పనిచేసేందుకు బ్రిటన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్ ఆసక్తి కనబర్చింది. నౌకాదళం అభివృద్ధి చేస్తున్న దేశీయ తొలి ఎలక్ట్రిక్ యుద్ధ నౌక డిజైనింగ్‌లో ఈ కంపెనీ భాగస్వామి కానున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధ నౌకకు హైబ్రీడ్ ఎలక్ట్రిక్, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను అందించనున్నట్లు సమాచారం.

## దగ్గు మందు వివాదం..

### సీబీఐ విచారణ పిటిషన్‌ను కొట్టేసిన 'సుప్రీం'

మొదటిపేజీ తరువాయి



కోల్డ్‌రిఫ్' దగ్గుమందు కారణంగా మధ్యప్రదేశ్‌లో పలువురు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ, ఔషధ భద్రతా విధానాలలో వ్యవస్థాగత సంస్కరణలను కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిల్‌పై తక్షణమే విచారణ జరపాల్సి ఉందని పిటిషనర్, న్యాయవాది విశాల్ తివారి కోరడంతో విచారణ జరపడానికి గురువారం న్యాయస్థానం అంగీకరించింది. అనంతరం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తాను ఏ రాష్ట్రం తరఫున వాదించడం లేదని.. అయితే ఈ విషయంలో తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యల తీవ్రతను తగ్గించలేమని మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాల్లో పలు చట్టపరమైన యంత్రాంగాలు ఉన్నాయని..ఇందుకు సీబీఐ అవసరం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిల్‌ను తోసిపుచ్చింది.

'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో చాలామంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. చిన్నారుల మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈక్రమంలో ఆ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబరు 11 2025

# అన్నదానంతో పాటు పేద మహిళలకు చీరల పంపిణీ





- ◆ 1631 రోజులుగా నిరంతర అన్నదాన సేవలు
- ◆ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ కు ప్రశంసలు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1631 రోజులుగా నిరంతర అన్నదాన కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. అన్నదానంతో పాటు లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ వద్ద పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రాజన్న, భీమేశ్వర ఆలయాల అన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్,సభ్యులు డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాత సంతోష్, పొలాస రాజేందర్, జూలపల్లి రాజు, చిన్నారి పాత సహస్ర మిద్దె శరత్ కుమార్ మిత్ర బృందం పాల్గొన్నారు.

# సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల తగ్గింపును వ్యతిరేకిస్తున్న జమ్మికుంట మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 10**
జమ్మికుంట మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు సాయంత్రం ఎం ఆర్ సి జమ్మికుంట ముందు ఏస్ జి టి సర్ ప్లేస్ పోస్టుల ను హైస్కూల్లో పీఈటి పోస్టుగా మార్చడం పై నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గుడిమిల్ల బలరాం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలోని ఏస్ జి టి సర్ ప్లేస్ పోస్టులను తగ్గించి హై స్కూల్ లో పి ఇ టి పోస్ట్ గా ఇస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమే అని,ఇప్పటికే మేము డిమాండ్ చేస్తున్న తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు పి ఎస్ ఎచ్ యం పోస్ట్ ఇవ్వాలని కోరుచుంటే ఇవ్వకుండా,

ప్రైమరీ పాఠశాలల ఉనికిని కోల్పోవడం కోసం ప్రభుత్వం చర్యలకు పాల్పడడం చాలా దారుణమైన విషయమని, విద్యా వ్యవస్థలో ప్రాథమిక దశ చాలా ప్రాముఖ్యమైనది, ఇంటి నిర్మాణానికి పునాది ఎంత గట్టిదో ప్రాథమిక పాఠశాలలు కూడా పునాది లాంటివే,ఈరోజుల్లో ప్రతి తల్లిదండ్రులు రెండు,




మూడు సంవత్సరాలకే ప్రవేట్ పాఠశాలకు పంపిస్తున్న తరుణంలో మూడు సంవత్సరాలు ప్రైవేట్ పాఠశాలలకు అలవాటు అయిన వ్యక్తి మరి ఆరు సంవత్సరములు నిండగానే ఒకటో తరగతికి ఏ విధంగా మళ్లీ తిరిగి వస్తాడో ఒకసారి ప్రభుత్వము ఆలోచన చేసి, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక తరగతుల అనుమతిని కేటాయించాలని,సర్ ప్లేస్ ఉన్న ఎస్జీటీ పోస్టులను పిఇ టి పోస్టులుగా మార్చకుండా ఉండాలని డిమాండ్ చేశారు. ద బ్బేట రవీందర్ మాట్లాడు తూ ప్రతి ప్రాథమిక పాఠశాలకు సంఖ్యతో సంబంధం లేకుండా తరగతి కి ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేసి ప్రాథమిక పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని, యం ఎ ల్ సి ఓటు హక్కు లేక పోవడమే మాకు జరుగుతున్న అన్యాయంగా భావిస్తున్నాం, కావున యం ఎ ల్ సి ఓటు హక్కుకై పోరాడాలని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. సర్ ప్లేస్ ఉన్న ఎస్జీటీ పోస్టులను పిఇ టి పోస్టులుగా మార్చకుండా ఉండాలని జమ్మికుంట సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయులందరూ మూకుమ్మడిగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్జిటి ఐక్యవేదిక కన్వీనర్ గుడిమిల్ల బలరాం, సభ్యులు దెబ్బేట రవీందర్ డి. నాగరాజు, మేడుదుల నాగరాజు, టి. వేణుగోపాల్, కే .రాజిరెడ్డి, కుమారస్వామి, విజయ్ ,సురేష్ ,రాజు, సారంగం, అంజన్ ప్రసాద్, , ,తిరుపతి, రాహుల్,ప్రసాద్, ప్రవీణ, రాణి, సంధ్యారాణి ,సంధ్య, శిరీష, సుమీర, హర్షియా, రాగిణి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కుడా చైర్మన్ ని సన్మానించిన దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు



**కరపత్రం ప్రతినిధి హన్మకొండ అక్టోబర్ 10**
హన్మకొండలో కాకతీయ అర్బన్ డెవల్మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి ని వారి కుడా ఛాంబర్ లో మర్యాదహపూర్వకంగా కలిసిన మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు గారు మర్యాద పూర్వకం గా కలిసి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం హుజురాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి సందీప్,ఉప్పుల అమరేందర్ రెడ్డి, వేణు చారి తదితరులు పాల్గొన్నారు.

# రానున్న కాలంలో రాజకీయం ఎలా ఉంటుందో నాయకులు మారిన రాజకీయం యధా తధాస్తుగానే

- రాజకీయం అంటే తెలియని వారు చేయడంతోనే రాజకీయం విచ్చలవిడిగా సాగుతున్న వైనం

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 10**
తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికలు సరైన సమయంలో జరగకపోవడంతో రాజకీయం ముసుగులో గుద్దులటగా మారడం తో ఏ ఒక్క గ్రామమైన ఇప్పటివరకు అభివృద్ధి చెందలేక పోవడానికి కారణం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల నుండి పరిపాలన సాగిస్తున్న ప్రతి గ్రామానికి ప్రథమ పౌరుడైనటువంటి సర్పంచ్ లేకపోవడంతో గ్రామ సెక్రెటరీ గ్రామ అభివృద్ధి పరిపాలన సాగిస్తున్నటువంటి వైనం పలు మండల కేంద్రాలలో మేజర్ గ్రామ పంచాయతీలో సరియైన సెక్రటరీ సరియైన సమయాలలో గ్రామాలలోని ఉన్నటువంటి పరిశుభ్రత పనులు చేయడంలోనే ముందస్తుగానే ఉన్నారని వారికి కూడా సరైన జీతభత్యాలు రాకపోవడంతో కూడా వారు అప్పులు చేసి గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతున్న వారిని అభినందించవలసింది కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతనంగా గ్రామ పంచాయతీలను







ఏర్పాటు చేసినటువంటి గ్రామాలలో మాత్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేని కొన్ని గ్రామాలు ఉన్నాయని చెప్పుకోవచ్చు తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయం ఎలా మారుతుందో తెలియని అయోమయ పరిస్థితులు ఏర్పాటు కావచ్చు అని తలుపులుఅయోమయ పరిస్థితులు ఏర్పాటు కావచ్చు అని పలువురు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్ర గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ప్రతి ఒక్క తెలంగాణ యువకులు పలు పార్టీల నాయకులు అందరూ కలిసి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలలో పాల్గొంటేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం స్వార్థ పర రాజకీయం 10 సంవత్సరాలు పరిపాలన చేసిందని తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మితిమీరిన హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిందని ప్రత్యేక తెలంగాణతో చిన్న చితక గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు కావడంతో రాజకీయం అంటే తెలియని యువత సర్పంచ్ అభ్యర్థిగా బడిలో ఉండి బి ఆర్ ఎస్ పార్టీ నుండి గెలుపొందడంతో గతంలో కొన్ని గ్రామాలు అభివృద్ధి నోచుకోలేకపోయామని సర్పంచ్ అంటే గ్రామానికి ప్రథమ పౌరుడని గ్రామంలో ఉన్నటువంటి ఎటువంటి సమస్యలకైనా తాను ముందస్తుగా ఉండి గ్రామ సమస్యలను తీర్చడమే కాకుండా గ్రామంలో జరుగుతున్నటువంటి ఎటువంటి సమస్యలైనా తీర్చే ప్రథమ పౌరుడని విలువలు ఉండేవని ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావడంతో చిన్న పెద్ద తేడాలు లేకుండా రాజకీయం చేయడంతో చిన్న పెద్ద వారికి విలువలు లేకుండా పోయాయని పలువురు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా మునుముందు రాజకీయం చేసేవారు రానున్న గ్రామ పంచాయితీ ఎన్నికలలో రాజకీయ అనుభవ ఏమిటి అనేది తెలిసిన వారికి వారిని ఎన్నుకొని వారి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని పలువురు తెలియజేస్తున్నారు

# నూతనంగా నిర్మిస్తున్న సబ్ హెల్త్ సెంటర్ ను పరిశీలించిన ప్రణవ్..



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 10**

- వైద్య సేవల విషయంలో ముందుంటాం.
- త్వరలో అందుబాటులోకి హెల్త్ సెంటర్..

పేదలకు అందించే వైద్య విషయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని,చెల్పూర్ పి. హెచ్.సీ పరిధిలోని సింగాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పరిశీలించారు. పనుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.వైద్యరంగ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని,మరిన్ని నిధులు కేటాయించి హుజూరాబాద్ లోని హాస్పిటల్స్ ను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గ నీటి సమస్యపై చర్యలు తీసుకోవాలని

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి
- వినతిపత్రం అందజేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట అక్టోబర్ 10**
మెదక్ జిల్లాలోని ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సింగూరు జలాలు విడుదల కావడంతో మంజీరా నది తీరంలో ఉన్న ప్రధాన పైప్‌లైన్ లీకేజీ కారణంగా మిషన్ భగీరథ ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన. నేపథ్యంలో, నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా, ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలను కోమటిబండ ప్రత్యేక



పైప్‌లైన్ ద్వారా శివ్వంపేట సంప్‌కు మళ్లించి, నియోజకవర్గానికి తక్షణమే నీటి సరఫరా ప్రారంభించాలని మంత్రివర్యులను కోరారు. మంత్రివర్యులు వెంటనే స్పందించి, మూడు నుండి నాలుగు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి కి ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయంతో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు పెద్ద ఊరటనిచ్చే అవకాశం ఉందని ఆవుల రాజిరెడ్డి తెలియజేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్ కోసం ఎల్లవేళలా పనిచేస్తుందని ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం తప్ప గత పరిపాలనలో ఇలాంటి పనులను చేసిందో మన రాష్ట్ర ప్రజలకు తెలుసునని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ అభివృద్ధి పనులు చేసే విధంగానే ఆయన కృషి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం పాటుపడాలని రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ నుండి నిలబడినటువంటి అభ్యర్థులను గెలిపించుకొని గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన తెలియజేశారు

# లడ్డూ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆరా

- విచారణ జరపి, వివరాలు అందజేయాలని ఈవోకు ఆదేశం
- తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన లడ్డు ఘటనపై తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. ఘటనకు సంబంధించి పూర్తి దర్యాప్తు జరిపి వివరాలు అందజేయాలని ఈవోను ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి ఈవో ఎల్. రమాదేవి లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్లు,



ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రికి వివరించారు. మున్ముందు ఎలాంటి తప్పిదాలు జరగొద్దని, జాగ్రత్తగా ఉండాలని మంత్రి సురేఖ ఈవోకు సూచించారు. ఆలయ ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి, జోగిపేట పట్టణాలలో న్యాయ అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి చైర్మన్ జి. భవాని చంద్ర ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవ్షాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య, సబిత, జోగిపేట జడ్జి మహ్మద్ అసాదుల్లా షరీఫ్ విబిన్న ప్రతిభావంతుల పాఠశాలలో న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, మానసిక ఒత్తిడి నియంత్రణ పద్ధతులు, సానుకూల దృక్పథం అలాగే చట్టపరమైన రక్షణల గురించి వారు వివరించారు. మానసిక ఆరోగ్యం ప్రతి మనిషి సమగ్ర








అభివృద్ధికి పునాది అని, ముఖ్యంగా విద్యార్థులలో ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపుదలతో పాటు సహనం వంటి అంశాలు అత్యంత అవసరమని సూచించారు. మానసిక ఆరోగ్యం శరీర ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైదంని హితవు పలికారు. ఆత్మహత్య నిరోధక చట్టాలు, మానసిక సమస్యలపై ప్రభుత్వ సహాయక హెల్ప్‌లైన్‌లు, అవగాహన కేంద్రాల గురించి కూడా వారు వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మానసిక ఆరోగ్యంపై చైతన్యం పెంచడంతో పాటు సమాజంలో సానుకూల ఆలోచనల పునరుద్ధరణలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల, కళాశాలాల అధ్యాపకులు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబరు 11 2025

# ఐక్యరాజ్యసమితి వేదికపై భారత్ తరపున గళమెత్తిన ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 10:**



ప్రపంచ దేశాలన్నీ కలిసి అభివృద్ధి చెందాలన్నదే భారతదేశం ఆశయం అని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అన్నారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి (యూఎన్) రెండో కమిటీలోని మ్యాక్రో ఎకనామిక్ పాలసీ ప్రశ్నలు, ఫైనాన్సింగ్ ఫర్ డెవలప్‌మెంట్ పై సాధారణ చర్చలో ఆయన భారతదేశం తరపున ప్రసంగించారు. ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంక్షోభ దశలో ఉంది. వృద్ధి మందగించింది. ఇలాంటి సమయంలో ప్రపంచ వాణిజ్యం సమ్మిళిత వృద్ధికి ఇంజిన్‌లా పనిచేయాలి. న్యాయమైన, పారదర్శకమైన, సమగ్ర వాణిజ్య వ్యవస్థకే భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు అవసరమని, అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుక ప్రపంచ వేదికలపై వినిపించాలన్నది భారతదేశం అభిప్రాయం అని తెలిపారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఆధ్వర్యంలో ఉన్న అంతర్జాతీయ వ్యాపార నియమాలకు దేశాలన్నీ కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యం గ్లోబల్ వ్యాల్యూ చైన్‌లో పెరగాలి, అప్పుల పారదర్శకత మరియు సమర్థవంతమైన నిర్వహణ అత్యవసరం అని ఎంపీ పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులను వేగంగా సమీకరించాలని, అన్ని దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగితేనే స్థిరమైన ప్రపంచ అభివృద్ధి సాధ్యం అని వంశీ కృష్ణ పిలుపునిచ్చారు.

# కూలీల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**– మనాలి ఠాకూర్**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 10:** కూలీల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండలంలోని ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలను సందర్శించి వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూలీలతో సాన్నిహిత్యంగా మాట్లాడుతూ వారి జీవన పరిస్థితులు, పనితీరు, ఎదుర్కొంటున్న సమస్యలు మరియు అభ్యర్థనలు గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. మనాలి ఠాకూర్ కూలీల కృషి పట్ల ప్రశంసలు వ్యక్తం చేస్తూ, వారికి తగిన సౌకర్యాలు, మెరుగైన పని వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకునేలా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కి నివేదిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు ఎలా నెరవేరుతున్నాయో వివరించారు. ప్రతి కూలీ జీవన ప్రమాణం మెరుగుపరచడమే పార్టీ ప్రధాన ధ్యేయమని ఆమె పేర్కొన్నారు.

# మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు వేములవాడ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ యూనియన్ మహాసభల పోస్టర్ ను రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం అశోక్ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ బహిరంగలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బహిరంగ సభలో రాబోయే మూడు సంవత్సరాల కాలంలో కార్మికులు సాధించుకోవాల్సిన హక్కులు వాటి ప్రణాళికలను రచించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు సరిపల్లి నరేష్, కార్యదర్శి దుబ్బ లచ్చయ్య, ఉపాధ్యక్షులు వావిలాల లక్ష్మి, గుడిసె మల్లేశం, సావనపల్లి శీను కమిటీ సభ్యులు జంగ రాజు, చింతల్ తాడెం శ్రీనివాస్, కుమ్మరి రాము, చింతల్ తాడెం అనిల్ పాల్గొన్నారు.

# కలర్ డబ్బాలపై పత్రికల్లో వచ్చిన కథనాలు బాధించాయి

**– ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ కే. జ్యోతి**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ ఎస్సి బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థినిలను కలర్ డబ్బాలు తెమ్మన్నామని, ఇబ్బందులకు గురి చేస్తున్నామని వివిధ కథనాలతో పలు పత్రికల్లో, ఛానళ్లలో, సోషల్ మీడియా వేదికగా పాఠశాల, కళాశాలపై ప్రచారం చేయడం చాలా బాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ కే. జ్యోతి అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ లో విద్యార్థులు పెట్టుకున్న నిబంధన, పేరెంట్స్ కమిటీ అంగీకారంతో ఆ నిర్ణయం తీసుకున్నామే తప్ప మా సొంత నిర్ణయం కాదని, విద్యార్థులకు సమయపాలన, డబ్బు విలువ తెలుస్తుందని ప్రిన్సిపాల్ గా నేను అంగీకరించానే తప్ప, దాంట్లో ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు.

# ఘనంగా కృతిక పూజలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10**



శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు కరీంనగర్ నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ ఆలయంలో కృతిక నక్షత్రం సందర్భంగా శుక్రవారం శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఆలయ పూజారులు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కమిటి భాధ్యులు, భక్తులు పాల్గోన్నారు.

# పోలీసు సిబ్బంది , హోం గార్డ్స్‌కు రేయిన్ , శీతాకాలపు స్వెటర్ లను పంపిణీ చేసిన పోలీస్ కమీషనర్ - గౌష్ ఆలం



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10**

వర్షాకాలం, చలికాలం నేపథ్యంలో విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ కమీషనరేట్ పరిధిలోని 300 మంది హోం గార్డ్స్‌కు రేయిన్‌కోర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ – “వర్షాకాలం,చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఈ రేయిన్‌కోర్ట్స్ , శీతాకాలపు స్వెటర్ లను సద్వినియోగం చేసుకోవాలి. విధి నిర్వాహణలో వీటిని అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీంరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రజినీకాంత్ , శ్రీధర్ రెడ్డి హోం గార్డ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ లో సీట్ సాధించిన ఎస్వీజెసి కళాశాల విద్యార్థి.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10**




నగరంలోని శ్రీ వెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్నా వంగల అమూల్య ఎంబిబిఎస్ లో అత్యున్నత ర్యాంక్ సాధించి సిద్దిపేటలో సీటు సాధించిన కరీంనగర్ జిల్లా నాగుల మల్యాలలో రవీంద్ర చారి దంపతుల కుమార్తె అమూల్యని ఎస్ వి జె సి చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డిలు శాలువ మెమెంటోతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. అమూల్య తల్లితండ్రులకి శుభకాంక్షలు తెలియజేసారు.

# రాజన్న ఆలయంలో లడ్డు వివాదం

**– దుర్వాసన వస్తుందని భక్తుల ఆవేదన**
**– లడ్డూలను పరిశీలించిన బిజెపి నాయకులు**
**– అలాంటిదేమీ లేదని ఈవో ఖండన**


**కరపత్రం ప్రతినిధి వేములవాడ**





వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ లడ్డు ప్రసాదం నుండి శుక్రవారం దుర్వాసన వస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బిజెపి నాయకులు లడ్డు ప్రసాద విక్రయ కేంద్రంలోని లడ్డూలను పరిశీలించి పంపిణీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధ శ్రద్ధలతో స్వీకరించే లడ్డు తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని భక్తులకు రుచికరమైన లడ్డులను అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి మాట్లాడుతూ లడ్డూల నుంచి ఎలాంటి దుర్వాసన రాలేదని, కేవలం విక్రయ కేంద్రం బయట ఉన్న పాత లడ్డు డబ్బాల నుండి వస్తున్న వాసనను భక్తులు లడ్డూల నుండి వస్తున్నట్టు పొరపాటు పడినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అన్నదాన ట్రస్టుకు విరాళం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయ అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజిగూడకు చెందిన నీలగిరి శంకరరావు కుటుంబ సభ్యులు రూ. 1,11,111 విరాళాన్ని చెక్కు రూపంలో శుక్రవారం ఆలయ ఏఈఓ శ్రవణ్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిఈఈ మధు రఘునందన్, ఆలయ ఉద్యోగులు ఉన్నారు.

# శ్రీ రామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10**

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రతినిధులతో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి హాజరై మాట్లాడుతూ పురాతన ఆలయాలను సంరక్షించవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నదని ముఖ్యంగా ప్రాచీనమైన ఆలయాలు చాలా శక్తివంతమైనవని , వాటి పరిరక్షణకై ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని సూచించారు.మన భారతదేశంలో అనేక ఆలయాలు ఉన్నాయని ప్రతి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉన్నదని గంగాధర మండలంలోని వెంకంపల్లి లో గల శ్రీ రామలింగేశ్వర ఆలయం సైతం చాలా ప్రఖ్యాతిగాంచినదని, మహిమాన్వితమైనదని వారు గుర్తు చేశారు.ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివృద్ధికై రూ.1,16,000/- విరాళం అందజేయడం జరిగిందని , భవిష్యత్తులోనూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేటువంటి పలు కార్యక్రమాలకు సైతం ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు.పునర్నిర్మాణం త్వరలో పూర్తికై చొరవ తీసుకోవాలని, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చి స్వామివారి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి ఆ దేవుని యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంద వేణి వెంకట్ , సహస్ర జూనియర్ కళాశాలల అధినేత, ఆలయ కమిటీ చైర్మన్ సంకటి శ్రావణ్ , పల్మరి సతీష్ యాదవ్ , పల్మరి సంపత్ యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహా శక్తి దేవాలయంలో వైభవంగా సంకష్ట చతుర్దశి వేడుకలు.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10**

**– ఘనంగా గణపతి హోమ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు.**
**– వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.**

కరీంనగర్ పట్టణం లోని మహిమాన్విత భవ్య, దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో శుక్రవారం రోజున సంకష్టి చతుర్దశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంకష్ట సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజ , గణపతి హోమ కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఆయా ప్రత్యేక పూజ, గణపతి హోమ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ లతోపాటు అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యువతిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్ట్

**– చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

చందుర్తి మండలానికి చెందిన యువతి వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని, లేకుంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన అనంతపల్లి గ్రామానికి చెందిన వేణుపై కేసునమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం అనంతపల్లి గ్రామానికి చెందిన సలేంద్ర వేణు, అతని స్నేహితుడు పోలే ప్రశాంత్ నుండి చందుర్తి మండలానికి చెందిన యువతి వ్యక్తిగత ఫోటోలు తీసుకొని వాటి ద్వారా ఆ యువతికి ఇంస్టాగ్రామ్ లో ఒక ఫేక్ ఐడి క్రియేట్ చేసి, మెసేజ్ చేస్తూ 5 లక్షల రూపాయలు ఇవ్వాలని లేకుంటే ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించడం జరిగిందని షీ టీం, చందుర్తి పోలీసులను యువతి సంప్రదించగా సాంకేతిక పరిజ్ఞానం తో శుక్రవారం వేణును పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ విషయమై యువతులు తమ వ్యక్తిగత ఫోటోలు ఎవరికి ఇవ్వద్దని సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ కోరారు. సీఐ వెంట చందుర్తి ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# అన్నదాన ట్రస్ట్ కు 3 లక్షల విరాళం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజేశ్వర స్వామి ఆలయ అన్నదాన ట్రస్టుకు సిరిసిల్లకు చెందిన జోగిని పెల్లి స్రవంతి- వెంకట కిరణ్ కుటుంబ సభ్యులు మూడు లక్షల రూపాయల చెక్కును ఆలయ ఈవో ఎల్. రమాదేవికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అకౌంటు అడ్వైజర్ ఆగమరావు, ఆలయ ఉద్యోగులు ఉన్నారు.